విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

కొల్లేరును కొల్లగొట్టేస్తారా...

- వందలాది ఎకరాల్లో చెరువుల తవ్వకానికి రంగం సిద్ధం
- అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే...
- రాజకీయ ఒత్తిళ్లతో చోద్యం చూస్తున్న అటవీ శాఖాధికారులు

పెదఎడ్లగాడి వంతెన వద్ద మేటలు వేసిన గుర్రపుడెక్క

విశాలాంధ్ర- మండవల్లి: కొల్లేరు సరస్సు పేరు వినగానే పర్యావరణ ప్రేమికుల మనస్సు ఉప్పొంగిపోతుందనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. సహజసిద్ధమైన కొల్లేరు సరస్సును పరిరక్షించుకోవాలి, చిత్తడి నేలలను సంరక్షించు కోవాలని తరుచు సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తూ సమాజ సేవకులు కొల్లేరు ప్రాముఖ్యతను వివరిస్తూనే ఉంటారు. కొల్లేరు సరస్సు పరిరక్షణకు ప్రత్యేక చట్టాలు, అధికార యంత్రాంగం ఉన్నా రాజకీయ నాయకుల వత్తిళ్లకు కొల్లేరు కబ్జాదారుల బారిన పడుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొల్లేరు ఆపరేషన్ 2006లో జరిగినా తదనంతర కాలంలో కొల్లేరులో అక్రమ చెరువుల తవ్వకాలు, ధ్వంసం చేసిన చెరువుల సాగు యథాలాపంగానే సాగుతోంది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీ నాయకుల అండతో కొల్లేరులో తవ్వకాలు సాగించేస్తున్నారు. కొద్దినెలల క్రితం కైకలూరు మండలంలోని చటాకాయలో అక్రమ చెరువులు తవ్వగా మండవల్లి మండలంలోని చింతపాడు హైస్కూలు సమీపంలోను తవ్వకాలు సాగాయి. సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో కొల్లేరులో అక్రమ తవ్వకాలకు రాజకీయ నేతలు మరోమారు తెరలేపారు. కొద్ది రోజులక్రితం నియోజకవర్గంలోని పందిరిపల్లి గూడెంలో పదుల సంఖ్యలో యంత్రాలతో అక్రమ చెరువులు తవ్వగా మీడియాలో కథనాలతో అధికారులు తూతూ మంత్రంగా అడ్డుకున్నారు. కొల్లేరు విస్తరించి ఉన్న గ్రామాల్లో తాగునీటి చెరువుల పేరుతో కొల్లేరును తవ్వేందుకు నాయకులు ప్రణాళికలు సిద్ధం చేసేశారు. గ్రామానికి వంద ఎకరాలు చొప్పున తవ్వటంతో పాటు తవ్వకం ఖర్చులను స్థానికులే భరించాలని నేతలు నిర్ణయించినట్లు సమాచారం. అటవీశాఖాధికారులు తవ్వకాలవైపు కన్నెత్తి చూడకుండా ఉండేందుకు నగదు బహుమానాలు ఆయా గ్రామాల నుండి వసూలు చేసిన మొత్తంలోనే ఇవ్వాలనేది వ్యూహంగా ఉన్నట్లు తెలిసింది. పలు సంస్థల ప్రతినిధుల ద్వారా తవ్వకాల సమాచారం బయటకు పొక్కకుండా ఉండేందుకు వేలల్లోనే నగదును పంపిణీ చేస్తున్నారనే వాదనలు బహిరంగంగా వినవస్తున్నాయి. కొల్లేరు ఆపరేషను సమయంలో జిరాయితీ భూములను ధ్వంసం చేశారని, వాటిని తిరిగి ఇవ్వాలని నాయకులు పదేపదే ప్రభుత్వాన్ని కోరేవారు. ఈతంతు పూర్తి కాకుండానే కొల్లేరులో తాగునీటి చెరువుల ముసుగులో తవ్వకాలకు సన్నాహాలు సాగుతున్నాయి. వానలు రాకుండా ఉంటే కొల్లేరులో ప్రస్తుతం ఉన్న నీరు తగ్గుముఖం పట్టనుంది. జూను నెలనాటికే కొల్లేటి గ్రామాల్లో అక్రమ చెరువుల తవ్వకాలు పూర్తి చేయాలని రాజకీయ నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. మండవల్లి మండలంలో కొల్లేరు విస్తరించి ఉన్న గ్రామాలు పది వరకు ఉన్నాయి. ఇప్పటికే సొసైటీ చెరువులలో చేపల సాగుతో స్థానికులు వాటాలు పంచుకుంటుంటారు. ఏటా వేసవి రాకముసుపు జనవరి నెలలోనే గొర్రెల మేతల పాటలు నిర్వహించి వచ్చిన లక్షలాది రూపాయలను ఆయా గ్రామవాసులు పంచుకుంటారు. కొల్లేరులో వేసవిలో అడుగు పట్టుబడులు జరిపి సొమ్ముచేసుకుంటుంటారు. కొల్లేరు సరస్సును కొల్లగొట్టేస్తున్నా పర్యవరణ చట్టాలను కఠినంగా అమలు చేయటంలో అటవీ శాఖాధికారులు చేతులెత్తాశారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా మండలంలోని పది కొల్లేరు గ్రామాల్లోను చెరువులు తవ్వేందుకు సిద్ధమవుతున్నారు. కొల్లేరులోకి తాగునీటిని తీసుకువెళ్లే కాలువలు పూర్తిగా కనుమరుగవ్వగా మంచినీటి చెరువుల పేరుతో తవ్వకాలకు తెరలేపటం ఓట్లు దండుకునేందుకే అనే వ్యాఖ్యానాలు వినవస్తున్నాయి.

అధికారులు ఏం చేస్తున్నారు: కొల్లేరును అక్రమార్కుల నుండి సంరక్షించాల్సిన అధికారులు రాజకీయనేతల అడుగులకు మడుగులు ఒత్తుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కైకలూరులోనే అటవీశాఖ కార్యాలయం ఉన్నా కైకలూరు,మండవల్లి మండలాల్లోను కొల్లేరు విస్తరించి ఉన్న గ్రామాల్లోను అక్రమాలు సాగుతున్నాయి. తవ్వకాల సమయాల్లో దిగువ స్థాయి సిబ్బంది కార్యాలయాల్లో ఉండటం,ఉన్నత స్థాయి అధికారులు ఫోన్లు స్విచ్ఛాఫ్‌లో ఉన్న సందర్భాలు గతంలో ఉన్నాయి. కొల్లేరు పరిరక్షణ చట్టాలు నాయకుల ఓట్ల రాజకీయం నడుమ నలిగిపోతున్నాయి. మరికొద్ది రోజుల్లో మండలంలోని మణుగునూరు, పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, చింతపాడు తదితర గ్రామాల్లో అక్రమ చెరువులు తవ్వనున్నారు. ఇప్పటికే కొల్లేరులో అక్రమచెరువుల వల్ల ఎగువ గ్రామాల్లో పంట పొలాలు తరుచు ముంపు బారినపడుతున్నాయి.

పెదెడ్లగాడి వంతెన వద్ద కిలోమీటరు పొడవునా గుర్రపు డెక్క మేటలు వేసింది. మణుగునూరు వద్ద కాంటూరు అభయారణ్యంలో గత రెండురోజులక్రితం అక్రమంగా చేపట్టిన చెరువు తవ్వకాలను అటవీశాఖాధికారులు అడ్డుకున్నారు. తవ్వకందారు, స్థానికులు అటవీ సిబ్బందిని దుర్భాషలాడి విధులకు ఆటంకం కలిగించగా ఆవ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలియవచ్చింది. స్థానికులు మాత్రం కొల్లేరు తవ్వటం, అధికారులు ఆపటం యథాలాపంగా సాగే పనని రెండుమూడు రోజుల్లో తవ్వకాలు సాగుతాయని తెలపటం విశేషం.

ఓర్పు, సహనం, నైపుణ్యంతో వైద్య సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర - భీమవరం: ఓర్పు, సహనం, నైపుణ్యంతో వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం స్థానిక విష్ణు కాలేజ్ డెంటల్ ఆడిటోరియంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎమ్.ఎల్.హెచ్.పి)కు నిర్వహించిన 'బేసిక్ లైఫ్ సపోర్ట్ వర్క్ షాప్ కు' జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య విద్యలో మెళుకువతో కూడిన నైపుణ్యతను సాధించినప్పుడే వృత్తిలో రాణించగలరని తెలిపారు. పనిచేసే చోటే నివాసం ఉండి సేవలు అందిస్తే స్థానికంగా మంచి గుర్తింపు వస్తుందని ఆమె తెలిపారు. గ్రామస్థాయిలో ఆకస్మిక సంఘటనలు పాము కాటు, గుండెపోటు, అగ్ని ప్రమాదాలు తదితర సందర్భాల్లో బాధితుల ప్రాణాలను ఎలా రక్షించవచ్చు, అవలంబించవలసిన పద్ధతుల పై వీరికి ప్రాక్టికల్ గా శిక్షణను ఇవ్వడం జరిగింది. చివరిగా ఎమ్.ఎల్.హెచ్.పి లకు శిక్షణ సర్టిఫికెట్లను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో డి.మహేశ్వరరావు, అడిషనల్ డిఎంహెచ్వో భాను నాయక్, వైయస్సార్ హెల్త్ క్లినిక్స్ నోడల్ అధికారి డాక్టర్ కీర్తి, ఎమ్.ఎల్.హెచ్.పిలు పాల్గొన్నారు.

తాగునీటి వనరులను కలుషితం చేస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-ఉండి: తాగునీటి వనరులను కలుషితం చేస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. పాములపర్రు మంచినీటి చెరువును అధికారులతో కలసి జిల్లా కలెక్టరు శనివారం పరిశీలించి దిశా నిర్దేశం చేశారు. చెరువుకు నీరు వచ్చే మార్గంలో ఉన్న ఆక్వా చెరువులను తనిఖీ చేసి వ్యర్థాలు కాలువలో విడిచిపెట్టకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. ప్రతి గ్రామంలో మంచి నీటి చెరువులు శుభ్రతపై దృష్టి సారించాలన్నారు. రక్షిత మంచినీటిని రెండు పూటల అందించాలన్నారు. మంచినీటి చెరువు అపరిశుభ్రంగా ఉండటంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. చెరువులో నీరు పరిశుభ్రంతో పాటు చెరువు చుట్టూ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవా లన్నారు. పటిక, బ్లీచింగ్ పౌడరు వేసి మంచినీటి చెరువును తక్షణం తేటగా చేసి, ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు చేసి ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా త్రాగునీటి సరఫరా చేయాలన్నారు.

చిన్నారులకు వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర -భీమవరం: శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, నీతి కథలు, చిత్రలేఖనం, నృత్యం తదితర అంశాలపై విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. తొలుత మాజీ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథా లయాధికారి యస్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు డి.రామ నాగేశ్వరరావు, చదువరుల సంఘం అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, కె.భవాని శీతల్, కె.ఝాన్సీ, కె.శ్యామల, డి.శ్యామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలకు జనగణన జీవో విడుదలపై హర్షం

- సీఎం జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - గణపవరం: రాష్ట్రంలో ఉన్న బీసీ కులాల జన గణన అధ్యయన కొరకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తూ జీవో విడుదల చేసిందని రాష్ట్ర సూర్య బలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. శనివారం వివిధ బీసీ కులాల సంఘ నాయకుల ఆధ్వర్యంలో గణపవరంలో ఆమె నివాసం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం హర్షధ్వానాల మధ్య ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ బీసీ జన గణన జరగడం ద్వారా బీసీ కులాల వారికి జనాభా ప్రాతిపదికన హక్కుగా రావలసిన ఉద్యోగాలు, రాజకీయ ప్రాధాన్యత అలాగే సంక్షేమ పథకాలు వారి జనాభా ప్రాతిపదికన దక్కుతాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ నాయకులు రోంగల శ్రీను, శెట్టి త్యాగరాజా, చైతన్య, మణికంత, సాయికుమార్, శ్రీనివాసరావు, వివిధ బీసీ కుల సంఘాల నాయకులు వైయస్సార్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ కొరత లేదు

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలలో ఎటువంటి విద్యుత్ కొరత లేదని ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతలు నానాటికి ఉధృతం అవుతూ 50 డిగ్రీల వరకు నమోదు అవుతున్నాయని, ఎండల తీవ్రత వలన విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగి పోతున్నదని, ఎండల తీవ్రతకు, అధిక లోడు వలన 220 కెవి ఉండి ఇహెచ్ టి సబ్ స్టేషన్‌లో మూడో పవర్ ట్రాన్స్ఫార్మర్ ఓవర్‌లోడ్ అవుతున్నదన్నారు. ఉండి ఇహెచ్ టి సబ్ స్టేషన్ నెట్ వర్క్ మార్పులు చేయిట వలన గణపవరం, నిడమర్రు, ఉండి, భీమవరం, పాలకోడేరు, కాళ్ళ మరియు ఆకువీడు మండలలో కొంత మేరకు విద్యుత్ అంతరాయములు ఏర్పడ్డాయని తెలిపారు. 220 కెవి వేమగిరి-దువ్వ ఫీడర్ ఓవర లోడ్ అవ్వడం వలన పిప్పర కాశిపాడు , అత్తిలి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయములు ఏర్పడ్డాయని, ప్రస్తుతం ఎటువంటి విద్యుత్ కొరత లేదని ఆ ప్రకటనలో తెలిపారు. ఎప్పుడైనా విద్యుత్ గ్రిడ్ ఫ్రీక్వెన్సీ ఏ 50హెచ్ జెడ్ కంటే తక్కువగా ఉన్నప్పుడు మాత్రమే ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ ఇవ్వడం ద్వారా ఫ్రీక్వెన్సీని జాగ్రత్తగా మెయిన్ టైన్ చేస్తున్నట్టు తెలిపారు.

అని వార్య కారణముల వలన ఏదైనా విద్యుత్ అంతరాయము లేదా సమస్య తలెత్తినచో టోల్ ఫ్రీ నంబరు 1912 కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేసుకొన్న ఎడల సమస్య వెంటనే పరిష్కరించబడుతుందన్నారు. విద్యుత్ వినియోగ దారులందరూ ఎపిఇపిడిసిఎల్ కు సహకరించవలసిందిగా ఎస్ ఇ సాల్మన్ రాజు కోరారు.

CHANGE OF NAME

I, KUCHAMPUDI RADHA KRISHNA MURTHY RAJU (New Name), S/o BHIMARAJU, Previously Called KUCHAMPUDI RADHA KRISHNA MURTHI RAJU (Old Name), Resident of D.No. 5-68/6, R-B Main Road, Ramaraju warehousing, Nandhamillipadu Village, Akividu Mandal, West Godavari District, AP-534235, Now Changed my Name from KUCHAMPUDI RADHA KRISHNA MURTHI RAJU (Old Name) to KUCHAMPUDI RADHA KRISHNA MURTHY RAJU (New Name). Today onwards Use my New Name for all further Transactions.

CHANGE OF NAME AND DATE OF BIRTH AND MOTHER NAME

I, Neethipudi Vijaya Kiran, S/o. Neethipudi Raja Sekhar, D.No.13-23-21, Ambedkar Nagar, Gunupudi, Bhimavaram, West Godavari District, Andhra Pradesh-534201. Changing my name and Date of Birth and Mother name Nithipudi Vijay Kiran (Old Name) and (DOB) 06.01.1989 Mother Name Asswaradam Nithipudi to changing my new name Neethipudi Vijaya Kiran (DOB) 06.08.1992 and Mother name is Asha as per 10th Memo and Aadhar Card for all purposes.

సర్వసభ్య సమావేశానికి సర్పంచ్‌లు డుమ్మా

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి సర్పంచులు డుమ్మా కొట్టారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన సర్వ సభ్య సమావేశనికి మండలంలో ఉన్న అధికారులు, గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, కార్యదర్శులు, ఎంపిటిసిలు హాజరు కావలసిఉండగా, మండలం లో ఉన్న రాజవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ మినహా, మిగిలిన సర్పంచ్ లు ఈ సమావేశానికి హాజరు కాకపోవడంతో అధికార పార్టీలో అంతర్మథనం మొదలైంది. కొయ్యలగూడెం మండలం లో మొత్తం 17 పంచాయతీ లు ఉండగా ఒక్కరు మాత్రమే ఈ సమావేశానికి హాజరయ్యారు. మిగిలిన సర్పంచ్ లు ఎవరు కూడా సమావేశం లో పాల్గొనలేదు. దీంతో అజెండాలో ఉన్న ప్రధానమైన సమస్యలను చర్చించే అవకాశం లేకుండా పోయింది. పంచాయతీలో నిధులు లేకపోవడం, అప్పులు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం, సర్పంచులు తమ సొంత నిధులు ఖర్చు చేయడం సర్పంచుల గైర్హాజరుకు కారణాలై ఉంటాయని మండలంలో వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. నిధులు లేకుండా తూతూ మంత్రంగా జరిగే సమావేశాలకు హాజరై అభివృద్ధి పేరుతో చర్చించడం వలన ఉపయోగం లేదని కొందరు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం నిర్వహించిన ఈ సమావేశంలో ఎంపీపీ గంజిమల రామారావు, జడ్పిటిసి సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీలు తుమ్మలపల్లి గంగరాజు, మట్ట వనజాక్షి, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ప్రభుత్వ అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు జగనన్న ధ్యేయం

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం : ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలని ముఖ్యమంత్రి జగనన్న ధ్యేయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్య నారాయణ పేర్కొన్నారు. పెంటపాడు మండలం కోరుమిల్లి గ్రామానికి చెందిన 25 మందికి శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఇంటి స్థలం పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలని ముఖ్యమంత్రి జగన్ ఆశయమన్నారు. అందుకు అనుగుణంగానే ఎన్నికలకు ముందు పాదయాత్రలో 25 లక్షల మందికి ఇంటి స్థలాలు ఇస్తానని ప్రకటించినప్పటికీ సీఎం జగన్ మోహన్ రెడ్డి 33 లక్షల మందికి జగనన్న ఇంటి స్థలాలను పంపిణీ చేశారన్నారు. ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం నుంచి 1,80,000 ఆర్థిక సహాయంతో పాటు సిమెంటు, ఇసుక, ఇనుము కూడా అందజేస్తు న్నట్టు తెలిపారు. కోరుమిల్లి గ్రామంలో ఎంతోకాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ విషయమై జిల్లా కలెక్టర్ తో మాట్లాడి నేడు పట్టాల పంపిణీ చేయడం జరిగింద న్నారు. త్వర లోనే వీరం దరికీ సొంత ఇంటి నిర్మాణం ప్రభుత్వం చేపడుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు ఎంపీపీ దాసరి హైమావతి, వైకాపా జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్ కుమార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మార్ట్‌గేజ్ అయిన బజాజ్ ఫైనాన్స్ లి. విజయవాడ బ్రాంచ్ వారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, మార్ట్‌గేజ్ వద్దకు పశ్చిమగోదావరి జిల్లా, పెదపాడు(మం), ఏపూరు, తిమ్మనపాడు గ్రామ కాపురస్తుడు బెజవాడ శ్రీనివాసరావుగారి కుమారుడు శివ సత్యనారాయణ గారు మరియు వారి సోదరుడు ఇరువురూ ది. 18-06-2019న వ్రాసుకున్న స్థిరాస్తి పారీఖత్తు దస్తావేజు నెం.1558/2019 యస్.ఆర్.ఓ. వట్లూరు ద్వారా బెజవాడ శివసత్యనారాయణ గారికి ఎ-షెడ్యూలు దాఖలా ఆస్తి సంక్రమించి సర్వ హక్కులతో అనుభవించుచూ అందులోని 1వ అయిటంపై ఋణము కొరకు మార్ట్‌గేజ్‌ను సంప్రదించియున్నారు. సదరు ఆస్తి బెజవాడ శోభనాచలం గారు ది.24-03-1969న విక్రయ ద.నెం. 1434/1969 గా యస్.ఆర్.ఓ. ఏలూరు రీత్యా ఆర్.యస్.నెం. 242/5లో యు.0-12సెంట్లు స్థలము మరియు మరి కొంత ఆస్తిని వివిధ డాక్యుమెంట్ల ద్వారా కొనుగోలుచేసి సర్వ హక్కులతో అనుభవించుచూ ది.17-11-2008న ఒక అన్ రిజిస్టర్డ్ వీలునామాను వ్రాయించి ది.29-12-2008న మరణించిన దరిమిలా సదరు వీలునామా రీత్యా సంక్రమించిన ఆస్తులను బెజవాడ శివసత్యనారాయణ మరియు వెంకట నాగేంద్రరావు గార్లు పారీఖత్తు దస్తావేజు రాసుకొని రిజిష్టరు చేసుకొని యున్నారు. సదరు ఆస్తికి చెందిన అన్ రిజిష్టర్డ్ వీలునామా పోయినదని తెలిపి దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని మార్ట్‌గేజ్ వద్ద తనఖాగా వుంచి ఋణం కొరకు మార్ట్‌గేజ్‌ను సంప్రదించి యున్నందున సదరు పోయిన అన్ రిజిష్టర్డ్ వీలునామా పై గాని, షెడ్యూలు ఆస్తిపై గాని మరియు పొందబోవు ఋణంపై గాని ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు, క్లయిములు, సెక్యూరిటీలు, హక్కులు, వగైరాలు ఉన్నచో 7రోజులలోపు వ్రాతపూర్వకంగా ఈక్రింది అడ్రసుకు తెలియజేయ వలెనని గడువులోపల ఎటువంటి క్లయిములు తెలియజేయనిచో నిష్పేచి ఆస్తిగా భావించబడును మరియు గడువు అనంతరము వచ్చు ఆక్షేపణలు, వగైరాలు మార్ట్‌గేజ్ హక్కులను బైండు చేయబడవు.

ఎ- షెడ్యూలు: అయిటం-1: పశ్చిమగోదావరి డి॥, వట్లూరు సబ్.డి॥, పెద పాడు(మం), ఏపూరు గ్రామ పంచాయితీ, ఏపూరు శివారు తిమ్మన వీధి గ్రామంలోని ఆర్.యస్.నెం. 242/5 దాఖలా యు.0-12 సెంట్లు స్థలములో తూర్పువైపు: చ.గ.276.5లు స్థలము, సదరు స్థలములో అసెస్మెంట్ నెం. 691రు కుగల డోర్.నెం.6-93గల ఆర్.సి.సి. డాబా ఇల్లు వగైరా ఆస్తికి హద్దులు **తూర్పు:** రాజులపాటి వీరాస్వామిగారు ఇతరులకు విక్రయించిన స్థలము అ.55.6లు, **దక్షిణం:** బజారు, అ.45లు, **పడమర:** బెజవాడ వెంకట నాగేంద్రరావుగారి వాటా ఆస్తి అ.54.6లు, **ఉత్తరం:** పంచాయితీ రోడ్డు, అ.45.6లు.

సాంబేలు ఆంజనేయ ప్రసాద్, అడ్వకేట్
AP LAW FIRM, డోర్.నెం.54-15-13, మధు టవర్స్, ఫ్లాట్ నెం. ఎఫ్.ఎఫ్.2, భారతీ నగర్, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్ ప్రక్కన, విజయవాడ-8. సెల్: 9949533987
విజయవాడ, తేది: 27-03-2023

నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో మనబడి - నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో శనివారం నాడు-నేడు పనులపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ నిర్మాణ పనులకు అనువైన వేసవి ముగిసే లోగా నాడు-నేడు కార్యక్రమం పనుల కింద చేపట్టిన అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్ లు, టాయిలెట్ లు , ప్రహరీ గోడలు,తదితర నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. టాయిలెట్ లకు నీటి సౌకర్యం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు రీఓపెన్ చేసే లోగా నాడు-నేడు కార్యక్రమంలో నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలు పాఠశాలల్లో చేపడుతున్న నాడు-నేడు పనులకు సంబంధించి నాణ్యతా ప్రమాణాలను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. నిర్మాణ మెటీరియల్స్ విద్యార్థుల ఆట స్థలాలకు దూరంగా ఉంచాలన్నారు. నాడు-నేడు పనుల పరిశీలనలో పేరెంట్స్ కమిటీలను కూడా భాగస్వాములను చేయాలనీ కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూ ఎస్ సూపెరింటెండింగ్ ఇంజినీర్లు చంద్రభాస్కర్ రెడ్డి, సత్యనారాయణ, డీ ఈ ఓ రవిసాగర్, గిరిజన సంక్షేమ శాఖ ఈ ఈ రమాదేవి, వివిధ శాఖల ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ శిక్షణా తరగతులకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-భీమవరం: ఈనెల 28,29,30 తేదీల్లో భీమవరం ఢిల్లీ పబ్లిక్ స్కూలులో జరుగుతున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్)కోస్తాంధ్ర విద్యా, వైజ్ఞానిక, రాజకీయ, సైద్ధాంతిక శిక్షణా తరగతుల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. సుందర్, ప్రధాన కార్యదర్శి టి.అప్పలస్వామి చెప్పారు. శనివారం శిక్షణా తరగతులు జరుగుతున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద వారు మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరగనున్న శిక్షణా తరగతులను 28 వ తేదీ ఉదయం 10 గంటలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత వత్సవాయి శ్రీనివాసరాజు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్, ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి,సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు,రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు,భీమవరం పట్టణ కార్యదర్శి సీహెచ్. రంగారావు, మండల కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ తదితరులు ప్రారంభ సభలో పాల్గొంటున్నా రన్నారు.కోస్తా ప్రాంతానికి చెందిన 12 జిల్లాల నుంచి 150 మంది విద్యార్థులు ఈశిక్షణా తరగతులకు హాజరవుతున్నట్టు సుందర్, స్వామి చెప్పారు.

విద్యార్థులకు సత్కారం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను కొయ్యలగూడెం ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గంజిమల రామారావు మాట్లాడుతూ విద్యార్థులు చదువులలో మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తమ భవిష్యత్తుకు తొలిమెట్టు పదవ తరగతి పరీక్ష ఫలితాలలో మంచి ఉత్తీర్ణత సాధించడమేనని విద్యార్థులకు సూచించారు. జెడ్పీటీసీ సభ్యులు దాసరి శ్రీలక్ష్మి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష ఫలితాలలో మంచి ఉత్తీర్ణత కనబరిచి మండలానికి మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. పరింపూడి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన మర్రెడ్డి వీర ఐశ్వర్య పరీక్ష ఫలితాలలో 582 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలవడంతో ఆమెకు ఎంపీపీ గంజిమల రామారావు 5000 రూపాయలు, జడ్పిటిసి సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి 2000 రూపాయలు మొత్తం ఏడు వేల రూపాయలు వారి చేతుల మీదుగా అందజేశారు. కాశీ రమ్య 574 మార్కు సాధించడంతో 5000 రూపాయలు ఆమెకు అందజేశారు. సంకు యజ్ఞశ్రీ రాఘవ 570 మార్కులు సాధించడంతో ఆమెకు నాలుగువేల రూపాయలను ఎంపీపీ, జడ్పిటిసిల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు తుమ్మలపల్లి గంగరాజు, మట్ట వనజాక్షి, ఎంఈఓ సురేష్ బాబు, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ఇంచార్జ్ ఈవోపీఆర్డి సత్యనారాయణ, ఎంపీటీసీలు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

విశాలాంధ్ర - ఆకివీడు: ఉప్పుటేరు సమీపాన దుంపగడప వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం పాలయ్యాడు. విజయవాడకు చెందిన జాన్ షారోన్(17) విశాఖపట్నంలో ఎయిర్ ఫోర్సులో శిక్షణ పొందుతున్నాడు. విశాఖపట్నం నుంచి ఉదయాన రైలు ద్వారా ఆకివీడు వచ్చాడు. మిత్రుడు తాడినాడకు చెందిన నంగి రెడ్డి ఉదయ సాయి ఇంటికి వెళ్లేందుకు బయలుదేరాడు. మృతుడిని ఉదయ సాయి అతని సోదరుడు ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్లేందుకు ఆకివీడు రైల్వే స్టేషన్ కి వచ్చారు. అనంతరం ముగ్గురు తాడినాడకు మోటార్ సైకిల్ పై బయలుదేరారు. హైదరాబాదు నుండి ఆకివీడు వైపు వస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు ఉప్పుటేరు కాటన్ బ్రిడ్జి వద్ద మలుపులో వీరిని వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న షారోన్ తలకు తీవ్ర గాయాలు అవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి ఆకివీడు ఎస్ఐ కొవ్వూరు రాజారెడ్డి హుటాహుటిన వచ్చారు. మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

వివిప్యాట్ గోదామును పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-ఏలూరు: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవిఎం) భద్రతపై ఏలూరు కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవిఎం, వివి ప్యాట్ గోదామును శనివారం జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. ఈ పరిశీలనలో ఈవీఎం, వివి ప్యాట్ రక్షణ, భద్రతను తనిఖీ చేశారు. వి.వి.ప్యాట్ గోదాముకు వేసిన సీళ్ల భద్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివి ప్యాట్ గోదామును క్షుణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. వీరి వెంట కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది కె. లక్ష్మీనారాయణ, కలెక్టరేట్ సూపర్నెంట్ టీఎల్ వి ఎస్ ప్రసాద్, ఐటి పర్సన్ జి. రాజేష్ తదితరులు ఉన్నారు.

పుస్తక పఠనాశక్తిని పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - ముదినేపల్లి : పుస్తకపఠనాశక్తిని పెంపొందించుకోవాలని రిటైర్డ్ గ్రంథాలయ అధికారి అవిర్నేని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలు ముదినేపల్లి గ్రేడ్ 3 శాఖ గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర మహాభారతంలో శ్రీకృష్ణ రాయబారం పద్యాలు విద్యార్థులను అలరింపజేశాయి. అనంతరం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ బోధించారు. విద్యార్థులతో ఇండోర్ గేమ్స్ ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి ఎం. శ్రీదేవి, స్పోకెన్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు జె. బాబురావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 4 సచివాలయంలోని ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం వైద్యాధికారిణి డాక్టర్ పి.కిరణ్మయి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ క్యాంపులో బిపి ,షుగర్, గర్భిణీ స్త్రీలను, బాలింతలను ,కిషోర్ బాలికలను ,పరీక్షించి వారికి ఉచితంగా మందులు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. నెలలో మూడుసార్లు ఈ క్యాంపు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ,67 రకాల మందులు, 14 రకాల రక్త పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం హెల్త్ ప్రొవైడర్ దేవిక, ఎంఎస్ యోహాన్, ఇ. జయమ్మ, ఆశా కార్యకర్తలు సిహెచ్ సుబ్బలక్ష్మి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-ఉండి : ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న వలంటీర్ సేవలు అభినందనీయ మని ఉండి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహారాజు అన్నారు. శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం ఉండి మండలం కోలమూరు గ్రామ సచివాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పివిఎల్ నరసింహారాజు హాజరయ్యారు. వాండ్రం, ఎస్ ఆర్ పి అగ్రహారం, పాములపర్రు, కోలమూరు, ఉప్పులూరు, కలిగొట్ల గ్రామాలకు చెందిన వాలంటీర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వాలంటీర్లకు సేవా మిత్రా, సేవారత్న, వజ్ర పురస్కారాలను పీవీఎల్ నరసింహారావు చేతుల మీదుగా ప్రధానం చేశారు. అనంతరం నరసింహారాజు మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతిని ప్రారదోలి పేదరికం నిర్మూలించడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాలంటీర్ల ,సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు సచివాలయ సిబ్బంది సచివాలయ కార్యదర్శిలు వాలంటీర్లు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

విశాలాంధ్ర-టీ నరసాపురం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథ పాలకుడు ఆర్. కిషోర్ తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవరచుకోవాలి అన్నారు. పుస్తక పఠనం వలన విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలు వినియోగించుకొని సృజనాత్మకతను పెంపొందించుకోవాలని తెలిపారు.



ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర- ఉండి: నిరుపేదల ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చెయ్యాలని జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి అధికారులను ఆదేశించారు.

శనివారం ఉండి మండలం చెరుకువాడ లే అవుట్ రహదారి పనులు జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ నెల చివరి నాటికి రహదారి నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. యంపిడివో కార్యాలయంలో ప్రత్యేక అధికారి, మండల అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లతో జిల్లా కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, లే అవుట్ లలో మౌలిక వసతులు త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ప్రత్యేక అధికారి, తహాశీల్దారు, యంపిడివో, గృహనిర్మాణ శాఖ అధికారులు గృహనిర్మాణ పనులు ఎక్కడ మందకోడిగా సాగుతున్నాయో వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు, సచివాలయ ఇంజనీరింగు సిబ్బంది క్షేత్ర స్థాయిలోనే ఉండి ఇండ్ల నిర్మాణాలు పై దృష్టి పెట్టాలన్నారు. లబ్ధిదార్లను కలసి వారి కున్న సమస్యలు తెలుసుకుని వారి మనో భావాలకు అనుగుణంగా త్వరితగతిన ఇండ్ల నిర్మాణాలు పూర్తి చెయ్యాలన్నారు. ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టని లబ్ధిదార్లను కలుసుకుని అవగాహన కల్పించి వారిని ఇళ్ళ నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలని జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి యం.రవి కుమార్, గృహ నిర్మాణ శాఖ ఇఇ బి. వెంకట రమణ, డిప్యూటీ తహాశీల్దారు యస్ వి యస్ నాయుడు , యంపిడివో ఏ.వి అప్పారావు, గృహ నిర్మాణ శాఖ డిఇఇ పి.శివ రామరాజు, డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా

విశాలాంధ్ర - నిడమర్రు: నిడమర్రు మండలం చానమిల్లి గ్రామ ప్రజలు త్రాగునీరు సమస్యతో ఇబ్బంది పడుతున్నారని జనసేన నాయకులు తెలియచేయగా వెంటనే స్పందించి శ్రీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ట్యాంకర్ ద్వారా ఎల్లమ్మ చెరువు ప్రాంత ప్రజలకు 6వ రోజు తాగునీరును సరఫరా చేసిన ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్ చార్జ్ పత్సమట్ల ధర్మరాజు ఆర్థిక సహకారంతో త్రాగునీరు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు గౌతు వెంకన్న బాబు, బెతు మురళీ, గ్రామ జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు కంటి విషయంలో జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం కాశిపాడు గ్రామంలో డాక్టర్ వై యస్ ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామంలో అర్హులైన 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు 73 మందికి నేత్ర వైద్యాధికారి ఐ.శ్రీనివాస్ కంటి పరీక్షలు నిర్వహించి,అందరికీ కళ్లజోళ్లు ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఈ సంద ర్భంగా పిప్పర పి. హెచ్.సి వైద్యాధికారిణి డాక్టర్ కె.ప్రియాంక మాట్లాడుతూ షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతి రెండు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించు కోవాలని కంటి పట్ల శ్రద్ధ వహిస్తూ చాలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు జంపన పద్మావతి, రమేష్ రాజు,గ్రామ వై యస్ ఆర్ పార్టీ నాయకుడు చిన్నం సిల్వెస్టర్ రాజు ,సొసైటీ కార్యదర్శి ఐ.రామకృష్ణ రాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి ఆర్‌డి రామారావు, పి.ఎం.పి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఏ ఆర్ కె పరమేశ్వర్లు, సి. హెచ్. ఓ. జె.విల్సన్ బాబు, ఆరోగ్య సహాయకుడు నామాల రాజు,రమ్య,మేరి గోల్డ్, ఆశ కార్యకర్తలు టి. వర లక్ష్మి, సి. హెచ్. కృష్ణ కుమారి వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

అష్టావధానం కళా సంస్కృతికి నిదర్శనం

విశాలాంధ్ర-ఆకివీడు : అష్టావధానం కళా సంస్కృతికి నిదర్శనమని దత్తపీఠ స్వర్ణ కంకణ సత్కార గ్రహీత శ్రీ తాతా సందీప్ శర్మ అవధాని అన్నారు. శనివారం ఆకివీడు మండలంలోని మాదివాడ శ్రీ మల్లేశ్వర స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు జరిగిన అష్టావధాన కార్యక్రమ ఆహ్వానంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లంక నాగ శశికళ అధ్యక్షతన. దేవస్థానం చైర్మన్లు గునుకుల కొండయ్య, మోటుపల్లి రాజు ఆధ్వర్యంలో భక్తులను, గ్రామ ప్రజలను ఆకట్టుకునే విధంగా అష్టావధాన కార్యక్రమం కొనసాగింది. అష్టవదానులు వేసిన ప్రశ్నలకు ఎంతో చాకచక్యంగా అవధాని సందీప్ శర్మ సమాధానమిచ్చి అందరి మన్నలు పొందారు. అనంతరం దేవస్థాన అర్చకులు లంక ప్రసాద్ దంపతులు అవధానులను సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పురిఘళ్ళ రఘురాం, చిట్టావురి సూర్యనారాయణ మూర్తి, రామకృష్ణారావు, సుదర్శనం ఫణి కుమార్, కడిమెళ్ళ విరించి, పసుపులేటి రామచంద్రరావు, కాకర్ల రాజేశ్వరి, తేనేటి మాస్టారు, డివి రమణమూర్తి, ఎర్ర రఘురాంతో పాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి మానవతా శాఖ ముందు ఉంటుందని కొయ్యలగూడెం మానవతా శాఖ సంస్థ సభ్యులు పేర్కొన్నారు. కొయ్యలగూడెం గ్రామానికి చెందిన అరేటి మంగరాజు కుమారుడు సురేష్ లారీ ప్రమాదానికి గురై కాలు సగ భాగం తీసివేయడం తో ఇంటి వద్దనే ఉంటున్న సురేష్‌కు మానవతా శాఖ తరపున 3000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందచేసారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థల వారు ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నక్క బాబి, నిడదవోలు రామారావు, ముప్పనపల్లి వెంకటేశ్వర రావు, దొడ్డా వీరాజు, వి ఎస్ ఎన్ స్వామి పాల్గొన్నారు.

మహానాడుకు తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తెలుదేశం పార్టీ వ్యవస్థాపకులు కీ.శే. నందమూరి తారక రామారావు శతజయంతి సందర్భంగా రాజమహేంద్రవరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమానికి కొయ్యలగూడెం గ్రామం నుంచి పోలవరం నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారెపల్లి రామారావు, మండల అధ్యక్షులు పారెపల్లి నరేష్, పట్టణ అధ్యక్షులు జేష్ఠ రామకృష్ణ,మొగపర్తి సోంబాబు,సుంకవల్లి సాయి,జిల్లా అధికార ప్రతినిధి జరం. చాందిని,యంత్రప్రగడ శ్రీనివాస్,ఉండవల్లి సోమసుందరం,తదితరులు వెల్లారని నరేష్ తెలిపారు.

మట్టి టిప్పర్ల జాతర

తహసీల్దారు కార్యాలయం చెంతనే... చర్యలు శూన్యం

విశాలాంధ్ర-మండవల్లి: వేసవి వచ్చిందంటే చాలు.. మట్టి తోలకాలు పండుగలాగా సాగటం మండవల్లి మండలంలో పరిపాటిగా మారిపోతోంది. నిబంధనలకు తూట్లు పొడుస్తూ మైనింగు శాఖ అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా మట్టి టిప్పర్లలోను, ట్రాక్టర్లలోను తరలిపోతోంది. చిగురుకోట, అయ్యవారిరుద్రవరం నుండి పెద్ద ఎత్తున మట్టి ఎగుమతి సాగుతుండగా నిర్వాహకులకు లక్షలాదిరూపాయలు ఆదాయం సమకూరు తోంది. టిప్పర్లు, ట్రాక్టర్ల ధాటికి కోట్లాది రూపాయలతో నిర్మాణం చేపట్టిన రహదారులు పూర్తిగా గతుకుల మయంగా మారుతున్నాయి. ఇప్పటికే చావలిపాడు,భైరవపట్నం గ్రామాల్లో చెరువులను పూడ్చివేయగా సచివాలయ ,రెవిన్యూ అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కాని ప్రశ్నగానే ఉంది. తాజాగా మండవల్లి గ్రామంలో తహసీల్దారు కార్యాలయం చెంతనే రైల్వే స్థలంలో చిగురుకోట నుండి మట్టిని టిప్పర్లతో తీసుకుని వచ్చి పూడిక చేస్తున్నారు. రేయింబవళ్లు మట్టి టిప్పర్లు మితిమీరిన వేగంతో గ్రామంలో తిరగటంతో వాహనదారులు, పాదచారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎటువంటి మైనింగు బిల్లులు లేకుండానే పదుల సంఖ్యలో టిప్పర్లు మట్టిని తరలిస్తున్నా అధికారుల్లో చలనం రాకపోవటం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వాదాయానికి గండి కొడుతూ తోలకాలు సాగు తుండటంతో అధికారులకు నెలవారి మామూళ్లు నిర్వాహకులు అందిస్తు న్నారని ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి.

మండల రెవిన్యూ కార్యా లయం సమీపంలోనే పూడికలు జరుగుతున్నా నిబంధనలు పాటిస్తున్నారో లేదో పట్టించుకున్నవారే కరువయ్యారు. మట్టి తోలకంపై తహసీల్దారును వివరణ కోరగా తన దృష్టికి వచ్చిందని అనుమతి పత్రాలు తీసుకు రమ్మన్నామని తెలిపారు. మట్టి తోలకాలు మాత్రం యథాలాపంగా సాగటం విశేషం.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర-ఏలూరు : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒక వ్యక్తిని ఏలూరు టూ టౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఇతని వద్ద నుంచి రు 2.40 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒక వ్యక్తి పరారయ్యాడు. ఏలూరు టూ టౌన్ సిఐ ఈ .శ్రీనివాసులు కథనం ప్రకారం.. స్థానిక తంగెళ్ళమూడి శివగోపాలపురం నకు చెందిన జూలూరు శేషగిరిరావు, జూలూరు గణేష్ లు సోదరులు.వీరిద్దరూ గుట్కా వ్యాపారం చేస్తుంటారు.వీరి వద్ద డ్రైవర్లుగా పనిచేసిన గేదెల సతీష్, రాగి ,నాగేశ్వరరావు లు కూడా గుట్కా వ్యాపారం చేసేవారు. కరోనా కారణంగా వ్యాపారం ఆపేసారు. మళ్లీ ఇప్పుడు వ్యాపారం ప్రారంభించారు.అయితే వీరి వద్ద ఎవరు గుట్కా కొనుగోలు చేయడం లేదు. జూలూరు శేషగిరిరావు జూలూరు గణేష్ వద్ద మాత్రమే కొంటున్నారు. జూలూరు బ్రదర్స్ వ్యాపారాన్ని దెబ్బతీయాలని గేదెల సతీష్, రాగి నాగేశ్వరరావు అనుకున్నారు.గంజాయి కేసులో జూలూరి అన్నదమ్ములను ఇరికించాలని అనుకున్నారు. ఇందుకోసం గేదెల సతీష్ ,రాగి నాగేశ్వరరావు కలిసి ఎక్కడి నుంచో గంజాయిని మోటార్ సైకిల్ పై తీసుకువస్తుండగా ఏలూరు టూ టౌన్ పోలీసులు తంగెళ్ల మూడి వద్ద వారిని పట్టుకున్నారు.రాగి నాగేశ్వరరావు పోలీసులకు దొరికిపోయాడు. గేదెల సతీష్ పరారయ్యాడు. పట్టుబడిన రాగి నాగేశ్వరరావు వద్ద నుంచి పోలీసులు రు.2.40 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పరారైన గేదెల సతీష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర - అనపర్తి : మండుతున్న ఎండలకు అల్లాడుతున్న పాదచారులు, వాహనదారులకు స్థానిక కెనాల్ రోడ్డులోని బగళాముఖి దేవి ఆలయం వద్ద కర్రి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ పంపిణీ చేసి దాహార్తిని తీర్చారు.సుమారు 1000 మంది మజ్జిగ సేవించి తమ దాహార్తిని తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్తి సంతోష్ రెడ్డి, కర్రి శ్రీకాంత్ రెడ్డి, సత్తి అవినాష్ రెడ్డి, ఓగిరెడ్డి వెంకట రామారెడ్డి, గొలుగూరి కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో కీలకపాత్ర పండిట్ నెహ్రూ

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం భారతదేశ తొలిప్రధాని పండిట్ జవహర్‌లాల్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆకుల వెంకటరమణ మాట్లాడుతూ తొలిప్రధానిగా నెహ్రూ అనేక సంస్కరణలు తెచ్చి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జునసాగర్, శ్రీశైలండ్యాంతోపాటు పలు విశ్వవిద్యాలయాలు తీసుకువచ్చి దేశాభివృద్ధిలో కీలకపాత్ర వహించారన్నారు. ఈ సందర్భంగా నెహ్రూచిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి రాజు, పులగల రాజు, కంభం రాజబాబు, ధనకోటి, అర్జున్, వల్లూరి రామ్మోహన్, బి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబాన్ని పక్కన పెట్టి పార్టీ అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర - తణుకు : తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు పార్టీ జెండాను తమ భుజాలపై మోస్తూ , కుటుంబ సౌఖ్యాలను కూడా పక్కన పెట్టి అన్ని వేళల పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వుంటారని తణుకు నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు.రాజమహేంద్రవరంలో జరుగుతున్న మహానాడు వేదిక పై శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు.పార్టీ కోసం ప్రాణాలు కూడా పణంగా పెట్టే కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ సొంతం అని చెప్పడానికి గర్విస్తున్నానన్నారు. అందుకే తెలుగు దేశం అనేది ఒక్క రాజకీయ పార్టీ కంటే కోట్లాదిమందితో కూడిన అతి పెద్ద ఉమ్మడికుటుంబంగా ఉంటూ అందరితో ఆత్మీయానుబంధం ముడిపడింది అన్నారు. గడచిన సంవత్సర కాలంలో ఎంతోమంది మన కుటుంబ సభ్యులు, ఆత్మీయులు వివిధ కారణాల వల్ల మృతి చెందడం వారిని మనం కోల్పోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మహానాడు వేదికగా మనకి దూరమైనటువంటి మన కుటుంబ సభ్యులను స్మరించుకునే తీర్మానాన్ని ప్రవేశ పెట్టే అవకాశం తనకు ఇచ్చినటువంటి తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకులు లోకేష్ బాబు , రాష్ట్ర అధ్యక్షులు సోదరులు అచ్చం నాయుడు , వేదికని అలంకరించినటువంటి మన కుటుంబ పెద్దలకి, వేదిక ముందర ఉన్నటువంటి మన కుటుంబ సభ్యులందరికి పేరు పేరున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.

తూతూ మంత్రంగా రౌతులపూడి మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - రౌతులపూడి : సగం ఎంపీటీసీ సభ్యులు కూడా సమావేశానికి హాజరుకాని వైనం. సరియైన సమాచారం లేకుండా సమావేశానికి హాజరైన అధికారులు. సమావేశంలో కూర్చోకుండానే వెనుదిరిగిన జెడ్పీటీసీ. ఇదీ శనివారం జరిగిన రౌతులపూడి మండల సర్వసభ్య సమావేశం తీరు. మండల పరిషత్ అధ్యక్షురాలు గంటిమల్లి రాజ్యలక్ష్మి అధ్యక్షతన మండల అభివృద్ధి అధికారి ఎం. గోవిందు నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖలపై సమీక్ష చేపట్టగా వివిధ శాఖల అధికారులు సమావేశంలో చర్చించి ఆయా శాఖాపరమైన విషయాల నివేదికను సమర్పించకపోవడంతో మండల అభివృద్ధి అధికారి గోవిందు ప్రతి సర్వసభ్య సమావేశంలోనూ సంబంధిత శాఖ అధికారులు సమావేశంలో చర్చించే నివేదికను సమర్పించాలని అధికారులకు సూచించారు. సమీక్షలో భాగంగా మండల విద్యాశాఖ అధికారి ఎస్‌వి నాయుడు మాట్లాడుతూ జూన్ 12వ తేదీన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతుందని అదే రోజున మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని 4,500 విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం వ్యవసాయ అధికారి రెడ్డి ఈశ్వరరావు సమీక్షలో భాగంగా ఏ మల్లవరం, రాఘవపట్నం, ఎస్ పైడిపాల, రౌతులపూడి రైతు మిత్ర గ్రూపులకు ట్రాక్టర్లు అందజేసినట్టు తెలిపారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ, పశుసంవర్ధక శాఖ, అటవీశాఖ అధికారులు సమీక్ష నిర్వహించారు. రౌతులపూడి జడ్పిటిసి సభ్యులు గొల్లు లక్ష్మణమూర్తి తనకు కుర్చీ కేటాయించలేదని కూర్చోకుండానే సభ నుండి వెనుకకు వెళ్లారు వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు మరియు గ్రామ సర్పంచులు కొందరు హాజరు కాకపోవడంతో సభ శోభను కోల్పోయింది. డిప్యూటీ తాసిల్దార్ పివి సత్యనారాయణ జెడ్‌పిటిసి సభ్యులు గొల్లు లక్ష్మణమూర్తి, కోఆప్షన్ మెంబర్ చింతకాయల వీర వెంకట సత్యనారాయణ వివిధ గ్రామాల ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు బీజేపీ

విశాలాంధ్ర - రాజానగరం :కమశిక్షణకు మారుపేరు గా భారతీయ జనతా పార్టీ ఉంటుందని,అందుకు అనుగుణంగా ప్రతి కార్యకర్త,నాయకులు క్రమశిక్షణతో వ్యవహరించవలసిన అవసరం ఉందని బిజెపి జిల్లా అధ్యక్షులు బొమ్ముల దత్తు అన్నారు.మండలంలోని శ్రీకృష్ణపట్నం గ్రామంలో మండల బీజేపీ అధ్యక్షులు పేపకాయల కాశీ అధ్యక్షత నిర్వహించగా,జిల్లా కార్యవర్గ సభ్యులు దొడ్డ అర్జున్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన నియోజకవర్గం స్థాయి కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.మరో అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి మాట్లాడుతూ నాయకులు ప్రతి ఒక్కరు బూత్ కమిటీలు వేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పథకాలు,విజయాలు వివరించారు. ఈ సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ ఏపీ.చౌదరి, నాయకులు మోదీ సత్తిబాబు,బోయిడి దుర్గారావు,అడబాల గణపతి రావు, మద్దుల సత్యనారాయణ,బొమ్మల సతీష్,తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

జూన్ 8న విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - అనపర్తి : కోట్లాది రూపాయల వ్యయంతో సర్వాంగ సుందరంగా, శిల్ప శోభాయమానంగా జీరుణోద్ధరణ గావింపబడిన స్థానిక శ్రీ శ్రీదేవి భూదేవి సమేత జనార్ధన స్వామి దివ్య ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహా సంప్రోక్షణ టీటీడీ వైఖానసాగమ పండితులతో వైభవంగా నిర్వహించనున్నట్లు నూతన విష్ణాలయ నిర్మాణ కమిటీ తెలిపింది. జూన్ 8న ఉదయం 7:42 కు యంత్ర స్థాపన, సహిత బింబస్థాపన, పంచాహ్నిక దీక్షతో దైవజ్ఞులచే సుముహూర్తం నిశ్చయింపబడిందని కమిటీ తెలిపింది. అదేవిధంగా స్వామి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట మహా సంప్రోక్షణ కార్యక్రమంలో భాగంగా జూన్ 4, 5,6,7 తేదీల్లో సంకల్ప దీక్ష కంకణం, గ్రామోత్సవం, విశ్వక్సేన పూజ పుణ్యాహం, అధి వాస హెూమం, అగ్ని ప్రణయనం, కలశారాధన వంటి కార్యక్రమాలు నిర్వహించబడతాయని ఆలయ ప్రధాన అర్చకులు (రాము) వివరించారు.యాజ్ఞిక నిర్వహణ ప్రొఫెసర్ వేదాంతం శ్రీ విష్ణు భట్టాచార్యులు (తిరుపతి), బ్రహ్మశ్రీ మిక్కిలి దుర్గయ్య శాస్త్రి (పెద్దాడ) పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాము తెలిపారు.

చాగల్లులో ఘనంగాఎన్టీఆర్ శత జయంతి

విశాలాంధ్ర - చాగల్లు : చాగల్లు మెయిన్ బజార్లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శత జయంతిని శనివారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అల్లాడి సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబటి పెద్దబ్బులు తదితరుల ఆధ్వర్యంలో స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రాజమండ్రిలో జరుగుతున్న మహానాడు మహాసభకు ఆదివారం భారీ ఎత్తున తరలి వెళు న్నట్లు అని తెలిపారు.

ఉండ్రాజవరంలో వలంటీర్లకు వందనం

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: మండలంలోని ఉండ్రాజవరంలో శనివారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిడదవోలు ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు సారథ్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంకితభావంతో సేవలందిస్తూ గ్రామ వాలంటీర్లు అవార్డులు కైవసం చేసుకుంటున్నారన్నారు. మొదటి విడతగా వేలివెన్ను, కాల్దారి, పసలపూడి, సూర్యారావు పాలెం, చిలకపాడు, వడ్లూరు, సత్యవాడ గ్రామాల వాలంటీర్లకు అవార్డులు ప్రధానం చేశారు. మొదటి తేదీ తెల్లవారుజామునే పింఛనందిస్తున్న వాలంటీర్లను తమ కుటుంబ సభ్యులుగా పెన్షన్ దారులు భావిస్తున్నారన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు వాలంటీర్లన్నారు. వాలంటీర్లు సేవా భావంతో పనిచేస్తూ కేటగిరి వారీగా సేవా మిత్ర, సేవారత్న, సేవావజ్ర లు గా గుర్తించి, ప్రభుత్వం అవార్డులు అందించి, ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జడ్పిటిసి నందిగం భాస్కర రామయ్య, వైస్ ఎంపీపీలు, షాజహాన్, ఆయా గ్రామ సర్పంచులు, కొఠారు సత్యనారాయణ, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో, ఈఓపిఆర్డి, అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-ముదినేపల్లి : అంగన్‌వాడీ కేంద్రాలలో వివిధ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఓ డి.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండవల్లి సెక్టార్ పరిధిలో ముదినేపల్లి మండలం చిగురుకోట చేవురుపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో చేవూరుపాలెంలో టీచర్ (బిసి-బి) , చిగురుకోట కేంద్రంలో సహాయకురాలు (జనరల్) 21 సంవత్సరాలు నుండి 35 సంవత్సరాల వయసులోపు వారై ఉండాలి. పదో తరగతి ఉత్తీర్ణులైన ఆసక్తి గల మహిళలు తమ ధ్రువీకరణ పత్రాలతో జూన్ 2న స్వయంగా రెండు సెట్లు దరఖాస్తులు మండవల్లి సెక్టార్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

వలంటీర్లకు సేవా పురస్కారాలు

విశాలాంధ్ర-కలిదిండి: జగనన్న వారియర్లుగా విశేష సేవలను అందిస్తున్న గ్రామ వాలంటీర్లకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అందుకుని ప్రభుత్వానికి పేరు తెచ్చేలా పనిచేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వాలంటీర్ల శ్రమను గుర్తించి గౌరవించే క్రమంలో గత మూడేళ్లుగా ఈ సన్మానాలు, పురస్కారాలు వలంటీర్లకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. సేవ వజ్రలు, సేవా రత్నాలు, సేవా మిత్రులుగా పురస్కారాలు అందుకుంటున్న ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నామన్నారు. రానున్న రోజులలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. గ్రామ సచివాలయాలలో వాలంటీరుగా పనిచేస్తున్న వారిని వేదికపైకి ఆహ్వానించి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బొర్రా. సత్యవతి, ఎంపీపీ చందన. ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీలు కనకదుర్గ రాణి, నాగలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ ఐనాల బ్రహ్మాజీ, వైస్ చైర్మన్ పాము. రవికుమార్, సర్పంచి పసిముక్కుల మారుతి ప్రసన్న, నంబూరి. శ్రీదేవి, వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, ఇన్చార్జ్ ఎంపీడీవో శ్రావణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉదయ్ కుమార్, శివన్నారాయణ, నాగబాబు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణానికి ముప్పు రసాయనిక సాగు

తగ్గుతున్న భూసారం- అంతరిస్తున్న సేంద్రీయసాగు

విశాలాంధ్ర-మండవల్లి : సారవంతమైన పంట భూములు రైతుల అవగాహనా లేమితో నిస్సారంగా మారుతున్నాయి.అధిక పంట ఉత్పత్తి చేయాలనే ఆదుర్దాతో రైతుల అవసరం లేకున్నా రసాయనిక ఎరువులు వాడి సేంద్రీయ సాగుని విడిచిపెట్టేయటంతో భూముల్లో రసాయనిక అవశేషాలు పెరిగి పంటల ఉత్పత్తులు జనారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గతంలో రైతులు ఒకే పంటను సాగు చేసినా వరి సాగుతో పాటు పాడి పశువుల పెంపకాన్ని అత్యంత శ్రద్ధగా నిర్వహించేవారు. ఇంటిల్లపాది గేదెలు ,ఆవులు ఉండటం అవి ఇచ్చేపాలను తాగి ఆరోగ్యంగా అప్పటి వారుండేవారు.పశువుల వ్యర్థాలను పంటభూములకు తరలించి పూర్తిగా సేంద్రీయ పద్ధతిలోనే సాగు చేపట్టేవారు.కాలక్రమేణా జనాభాపెరగటం ఆధునిక పద్ధతుల్లో భాగంగా యంత్రాలు రావటం స్వల్పకాలిక రకాలు అందుబాటులోకి రావటం రెండు పంటల సాగు విస్తరించటంతో పశుపోషణపై రైతాంగం నిర్లిప్తత కనబరిచారు.పశువుల కాపరులు సైతం అందుబాటులో లేక పోవుటంతో పశువులను మేపలేక ఎక్కువ మంది బడా రైతులు తమ భూముల్లోకి సేంద్రీయ పదార్థాన్ని తరలించలేకపోతున్నారు.

సేంద్రీయ పదార్థాలు భూమిలో తక్కువగా ఉండటంతో పైరుల్లో తెగుళ్లు,పురుగుల సమస్యలు ఎక్కువయ్యాయి.రైతుల అవసరతను సొమ్ము చేసుకునేందుకు ఎరువుల దుకాణాలు విస్తరించటం వ్యవసాయ అధికారుల సేవలు పరిమితంగా ఉండటం,రైతుల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులుండటంతో ఎరువుల డీలర్లు తమ హవాని కొనసా గిస్తూ రైతుల్ని దోచుకుతింటున్నారు. అక్కడక్కడా పలువురు రైతులు పచ్చిరొట్ట పైర్లను పెంచుదామని భావించినా సకాలంలో విత్తనాలు దొరకక పోవటం అవి అందరికి చేరకపోవటం ఒక్కో సారి విత్తనాలు ఉన్నా సకాలంలో భూమిలో తేమ లేక విత్తనాలు వేయలేకపోవటం ఒక వేళ విత్తుచల్లినా పైరు పూత దశలో భూమిలో కలియ దున్నటానికి కాలువల ద్వారా నీరు సకాలంలో రాకపోవటం వంటి విపత్కర పరిస్థితులను రైతులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. అధిక దిగుబడులు సాధించాలనే అత్యుత్సాహం, ఎక్కువ మంది సాగుదారులు కౌలు దారులు కావటం కూడా రసాయనిక సాగు పెరగటానికి కారణంగా ఉంది. ఇటీవలి కాలంలో రైతులను చైతన్యం చేయటానికి వ్యవసాయ శాఖ వారు ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నా వాటి ఫలితాలందరి రైతులకు చేరటంలేదు. మండల స్థాయిలోనే కాకుండా నేడు గ్రామ స్థాయిల్లోను ఆర్బికెలలో వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటున్నా పంట భూములు చేపల చెరువులుగా మారుతున్నాయంటే రైతులకు సాగులో ఆటుపోట్ల వల్ల వరి సేద్యంపై మక్కువ తగ్గుతుందనే చెప్పాలి. ఇప్పటికే బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు చుక్కలు చూపుతున్నాయి. కొద్ది పాటి వరి సాగునైనా సేంద్రీయ పద్ధతిలో నిర్వహించేలా ప్రభుత్వాలు రైతులకు రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలని రసాయనిక ఎరువుల వినియోగం తగ్గితే భూసారం పెరగటమేకాక ప్రజారోగ్యా నికి, పర్యావరణానికి మేలు జరుగుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.